# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం | 25 అక్టోబరు, 2026 | పేజీలు : 08


## పోలీసింగ్ వ్యవస్థ మరింత పటిష్ఠం కావాలి: సిపి గౌష్ ఆలం



వివరాలు మెయిన్‌లో...

## వార్డులు తిరిగి.. వైద్య సేవలపై రోగులకు భరోసా కల్పించి..



- జిజిహెచ్‌లో క్షేత్రస్థాయి పరిశీలించిన కలెక్టర్..
- ఆసుపత్రికి వచ్చే ప్రతీ రోగికి భరోసా కల్పించాలి..కలెక్టర్ చిత్రా మిశ్రా..
- రూ.6.5 కోట్ల క్రిటికల్ కేర్ సెంటర్ వినియోగంపై సమీక్ష

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఆసుపత్రికి వచ్చే రోగికి మెరుగైన వైద్యం అందడమే కాకుండా.. చికిత్స పొందే సమయంలో పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కూడా అందుబాటులో ఉండాలి. వైద్య సేవల నాణ్యతతో పాటు ఆసుపత్రిలోని వసతులు రోగులకు ఇబ్బందులు కలిగించకుండా ఉండాలని కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. శనివారం కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జి జిహెచ్)ను సందర్శించి, వార్డుల నుంచి మరమ్మతు పనుల వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**రోగుల అనుభవాలే ప్రాధాన్యం..**

ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకునేందుకు కలెక్టర్ నేరుగా రోగులతో మాట్లాడారు. ఎంఎన్‌డబ్ల్యూ యూనిట్, మహిళా వార్డు, ఒపి, సర్జికల్ తదితర విభాగాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. రోగులకు అందుతున్న చికిత్స, సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్‌ఎంఒ నవీనతో కలిసి వార్డులను పరిశీలించిన ఆమె.. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యులు, సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతకు నిరంతరం ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

**మరమ్మతుల్లో నాణ్యతే గీటురాయి**

రోగులకు మెరుగైన వసతులు కల్పించేందుకు చేపడుతున్న మరమ్మతు పనులు నిర్దేశిత ప్రమాణాలతో సాగాలని కలెక్టర్ సూచించారు. టిజిఎంఐడిసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, ప్యాచ్‌వర్క్‌లు, మరుగుదొడ్ల మరమ్మతులు, గదులు, కిటికీలకు సంబంధించిన పనులను పరిశీలించారు. పనులు పూర్తయ్యే వరకు నాణ్యతను పర్యవేక్షించాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల కారణంగా రోగులకు చికిత్స లో అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి**

గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స అందించేందుకు సుమారు రూ.6.5 కోట్లతో ఏర్పాటు చేసిన క్యాత్ ల్యాబ్ మిషన్లు, క్రిటికల్ కేర్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. వీటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లపై వైద్యాధికారులతో చర్చించారు. ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.

**రోగుల వెంట వచ్చేవారికీ వసతులు**

చికిత్స కోసం ఆసుపత్రులకు వచ్చే రోగుల సహాయకులు

తరువాయి 2 లో...

## 45 రోజుల్లో రైస్ మిల్లుల బకాయిలు 100 శాతం చెల్లించాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- బకాయిలు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తుల జప్తు
- బకాయిలు చెల్లించిన మిల్లర్లకే వచ్చే సీజన్‌లో బియ్యం కేటాయింపులు




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను 45 రోజుల్లోగా 100 శాతం చెల్లించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శశిధర్ రాజుతో కలిసి 15 మంది డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో ఆయన బకాయిల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వం తాజాగా విడుదల చేసి నజిఒ నంబర్ 17 ప్రకారం రైస్ మిల్లర్లకు పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు 45 రోజుల గడువు ఇచ్చినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని లేదా బకాయిలకు సమానమైన బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు. 45 రోజుల గడువులోగా బకాయిలను పూర్తిగా చెల్లించని రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత మిల్లర్ల ఆస్తులను జప్తు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బకాయిల వసూళ్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రాబోయే సీజన్‌లో డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు బియ్యం కేటాయింపులు జరగాలంటే ముందుగా వారు తమ పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించి, తదుపరి సీజన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు.ఈ సమావేశంలో ఒఎస్‌డి శ్రీధర్ రెడ్డి,జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్,మేనేజర్ శ్రీకాంత్ రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ వైద్య సేవలతో ఉన్నత స్థానాలకు ఎదగాలి



కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** ఉత్తమ వైద్య సేవలు అందించి ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో వైట్ కోట్ సెరమనీ కార్యక్రమం శనివారం నిర్వహించగా ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తోపాటు జిల్లా ఎస్‌పిమహేష్ బి గితేహే జరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులకు వైట్ కోట్‌లు అందజేసి అభినందించారు. అనంతరం నిర్వాహకులు జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్‌పిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. వైద్యుల సేవలు చాలా కీలకమని స్పష్టం చేశారు. వైద్యులు తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో భాగంగా వైద్యులు కొందరికైనా ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. దీంతో ఆత్మ సంతృప్తి ఉంటుందని అన్నారు. సిరిసిల్ల వైద్య కళాశాల, బాలికల, బాలుర హాస్టల్ నిర్మాణ పనులను తాను పలుమార్లు సందర్శించానని గుర్తు చేశారు. ప్రస్తుతం బాలికల హాస్టల్ వినియోగంలోకి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ నిర్విష, హెచ్‌ఒడి బైరి లక్ష్మి నారాయణ, తహసీల్దార్ మహేశ్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వ ప్రాధాన్యం

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి జగిత్యాల నియోజకవర్గంలో ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. తాటిపల్లి – మోరపల్లి గ్రామాల శివారులో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఈ పాఠశాలకు ఆదివారం మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా శంకుస్థాపననిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో భూమిపూజతో పాటు సభా కార్యక్రమం నిర్వహించే స్థలాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు.

**ఒకే ప్రాంగణంలో సమగ్ర విద్యా సౌకర్యాలు :**

పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో కల్పించడమే ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సుమారు 2,500 మంది విద్యార్థులకు, 500 మంది సిబ్బందికి అవసరమైన ఆధునిక సదుపాయాలతో పాఠశాలను నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు హాస్టల్, భోజన వసతి,క్రీడా ప్రాంగణం, సమావేశ మందిరం వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు.

**విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వ ప్రాధాన్యం**
**జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్**

తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ వివిధ కార్యక్రమాలు చేపడుతోందని ఎమ్మెల్యే అన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జగిత్యాల ప్రజల పక్షాన

తరువాయి 2 లో...

# మార్కెట్ కమిటీ నూతన చైర్మన్, డైరెక్టర్లకు సత్కారం



**ప్రజాపక్షం/గన్నేరువరం:**గన్నేరువరం మండల కేంద్రంలో శనివారం బెజ్జంకి మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ మాతంగి శిరీష అనిల్‌తో పాటు డైరెక్టర్లు దేశరాజు అనిల్ నందికొండ తిరుపతిరెడ్డి, మైనంపల్లి తిరుపతి, జెల్ల రాజేశ్వరిలను స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి స్వీట్లు తినిపించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు రైతుల సంక్షేమానికి, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని నూతన చై ర్మన్‌తోపాటు డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

# దసరాకు ఆసరా పింఛన్లు,చిలుక పచ్చచీరలు ఏమాయే?

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట సర్వసభ్య సమావేశం మండల ప్రజాపరిషత్ శుక్రవారం నిర్వహించిన సభలో అధికారులను కొంతమంది సర్పంచులు నిలదీశారు.తిమ్మాపురం సర్పంచ్ అధికారులతో మాట్లాడారు.రాజన్నసిరిసిల్లాలో నిండుసభలో దసరాకు పింఛన్లు ఆడబిడ్డలకు చిలుక పచ్చ చీరలు ఇస్తామని చెప్పారని అవి మరిచిపోయారని ఆవేదన చెందారు. అలివికాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టడం సరికాదన్నారు.పండుగ సందర్భంగా వృద్ధులకు చేయూత పింఛన్లు ఇంకను ఇవ్వలేదని అధికారులను తిమ్మాపురం సర్పంచ్ అందె సుభాష్ నిలదీశారు.అంతేకాకుండా పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. పలు ప్రాంతాలలో ముఖ్యమైన కూడళ్లలో స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేయాలని బ్లాక్ స్పాట్‌లను గుర్తించి వేగనియంత్రణ చేపట్టాలని కోరారు.ప్రమాదాలను నివారణ ఎంతైన అవసరం ఉందని చెప్పగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిశీలిస్తామని ఎంపిడిఓ తెలిపారు.

# ముత్తారం తహసీల్దార్ బదిలీ

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మధుసూదన్ రెడ్డి బదిలీ అయ్యారు.ఆయనను మంథని ఆర్‌డిఓ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.ఆయన స్థానంలో ప్రస్తుతం మంథని ఆర్‌డిఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అంజయ్యను ముత్తారం మండల నూతన తహశీల్దార్‌గా నియమించారు.ఈ బదిలీల నేపథ్యంలో నూతన తహశీల్దార్‌గా అంజయ్య త్వరలోనే ఇక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు. మండలంలో రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం,భూసంబంధిత సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

# విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వ ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి)



కృతజ్ఞతలు తెలిపారు. చల్గల్ ప్రాంతంలో సహజ వ్యవసాయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో స్థలం కేటాయించిన నేపథ్యంలో తాటిపల్లి – మోరపల్లి శివారులో 25 ఎకరాల్లో పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గతంలో వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో ఉన్నతాధికారులకు శిక్షణ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఆ సంస్థ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. అలాగే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు వారు తెలిపారు. ఆదివారం నిర్వహించనున్న శంకుస్థాపన కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

ఈ కార్యక్రమంలో డిసిసిఅధ్యక్షుడు గజంగి నందయ్య, ఎఎంసిచైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, మాజీ జడ్‌పిటిసిపెండెం రాములు, సర్పంచులు కట్ట రాజేందర్, బొలిశెట్టి గంగారెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం గౌడ్, సీనియర్ నాయకులు సమిండ్ల శ్రీనివాస్, అడువల లక్ష్మ ణ్, జిల్లా కాంగ్రెస్ ఎస్‌సిసెల్ నాయకుడు దుమాల రాజ్ కుమార్, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు భూమా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వార్డులు తిరిగి.. వైద్య సేవలపై రోగులకు భరోసా కల్పించి..

(మొదటిపేజీ తరువాయి)



ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.35 లక్షలతో ఏర్పాటు చే యనున్న విశ్రాంతి గదుల షెడ్డు పనులను కలెక్టర్ పరిశీలించారు. మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, రోగుల సహాయకులకు ఉపయోగపడేలా సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, పరిశుభ్రత, మౌలిక వసతులు, ఆధునిక చికిత్సా సదుపాయాల వినియోగం.. ఇలా ప్రతి అంశాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. కలెక్టర్ వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీన, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**భవనాల నిర్మాణ పనులు వేగవంతం**

ప్రభుత్వ మెడికల్ కాలెజీ, హాస్టళ్ల భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. అధికారులను ఆదేశించారు. శనివారం కొత్తపల్లిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజ్, విద్యార్థుల హాస్టల్ భవనాలను, నర్సింగ్ కళాశాల భవనాలను కలెక్టర్ పరిశీలించారు. పనుల పురోగతి, పెండింగ్ వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల హాస్టల్ భవనాలను నెలలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాల భవనానికి సంబంధించి మిగిలి ఉన్న పనులపై నివేదిక సమర్పించాలని ఆర్‌అండ్ బి డిఇ శ్రీకాంత్ ను ఆదేశించారు. టిజిఎంఎస్ఐడిసిఆధ్వర్యంలో రూ.26 కోట్లతో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల, హాస్టల్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. పనుల వివరాలను తెలుసుకున్నారు. పనులు చివరి దశకు వచ్చాయని, నవంబర్ నెలలోగా పూర్తి చేయనున్నట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. టిజిఎంఎస్ఐడిసి ఇఇ విశ్వ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

# గట్టేపల్లి హనుమాన్ ఆలయానికి బోర్‌వెల్ ఏర్పాటు!

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ఎంపీ నిధుల నుంచి మంజూరైన రెండు లక్షల రూపాయల వ్యయంతో సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న హనుమాన్ దేవాలయం లో ఏర్పాటు చేసిన బోర్‌వెల్ మోటార్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు, దేవాలయ అవసరాలకు నీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ బోర్‌వెల్ మోటార్‌ను ఏర్పాటు చేశారు.గ్రామంలోని హనుమాన్ దేవాలయానికి నీటి సౌకర్యం కల్పించేందుకు ఎంపీ నిధుల నుంచి రెండు లక్షలు మంజూరు కావడంతో బోర్‌వెల్ మోటార్‌ను ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో ఆలయ అవసరాలకు నీటి సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరటి శంకర్,గట్టేపల్లి గ్రామ సర్పంచ్ గుండేటి దేవేందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మూల సత్యం,మత్స్య పారిశ్రామిక సంఘం గ్రామ అధ్యక్షుడు ఐలవేణి వీరస్వామి,ఈర్ల రమేష్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.హనుమాన్ దేవాలయానికి బోర్‌వెల్ మోటార్ మంజూరు చేసిన శ్రీ గడ్డం వంశీకృష్ణ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.సహకరించిన ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నీరటి శంకర్‌కు ఆలయ కమిటీ సభ్యులు,ఆలయ అభివృద్ధికి,భక్తుల సౌకర్యాల కల్పన కు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# సిరిసిల్ల కళలకు పుట్టినిట్లు

మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి




**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల కళలకు పుట్టినిల్లు లాంటిదని ఈ ప్రాంతం నుంచి ప్రముఖ కవి రచయిత సినారే తన రచనల ద్వారా ఎంతో ఖ్యాతిని సాధించి దేశానికే గర్వకారణంగా నిలిచారని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి అన్నారు. శనివారం సిరిసిల్లలో రింగు రింగు గోల్డ్ రింగు అనే జానపద గేయం ప్రోమోను చైర్‌పర్సన్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కళాకారులు ఎంతోమంది తమ రచనలు పాటల నాట్యం వివిధ కళల ద్వారా మంచి పేరు సాధించి మన ప్రాంతానికి కళాత్మక రంగంలో గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా కళా రంగంలో విశిష్ట సేవలు అందించిన మహానుభావులను స్ఫూర్తిగా తీసుకొని రానున్న రోజుల్లో కళాకారులు కళా అభిమానులు ముందుకు వచ్చి మరిన్ని సంస్కృతిక సాంప్రదాయ, జానపద, నృత్యములలో మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. ఈ ఫోక్ సాంగ్‌ను చిత్రీకరించిన ప్రకాశ్ భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నిర్మాత ప్రకాశ్, నటీనటులు రామ్, హర్షితలను చైర్ పర్సన్ పాలకవర్గ సభ్యులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ విప్ మల్లిఖార్జున్,కౌన్సిలర్ సభ్యులు బుర్ర నారాయణ గౌడ్, గుడ్ల శ్రీనివాస్ , ఎలుక వెంకటేశం, లింగంపల్లి గంగరాజు, అడిచెర్ల రూపసాయి కృష్ణ, బత్తుల రమేశ్, రిక్కమల్లె రజిత సంపత్, రింగు రింగు గోల్డ్ రింగు పాట చిత్రీకరణ బృందం తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన పారమిత పాఠశాల విద్యార్థి



**ప్రజాపక్షం / కొత్తపల్లి :** కరీంనగర్ పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచాడు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి పబ్బతి విద్వాన్ రెడ్డి ప్రతిష్టాత్మక జాతీయస్థాయి రీజనల్ మ్యాథమెటికల్ ఒలంపియాడ్‌కు ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 6న దేశవ్యాప్తంగా నిర్వహించిన ఇండియన్ ఒలంపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ మ్యాథమెటిక్స్ పరీక్షలో అతను అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయి పరీక్షకు అర్హత సాధించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి సుమారు 8 వేల మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనగా వారిలో అత్యంత ప్రతిభ కనబరిచిన మొదటి 200 మంది విద్యార్థులు మాత్రమే తదుపరి దశ యిన ఆర్ఎంఓకు అర్హత సాధించారు. వారిలో విద్వాన్ రెడ్డి ఒకడిగా నిలవడం విశేషం. కాగా ఈ రీజనల్ గణిత ఒలంపియాడ్ జాతీయస్థాయి పరీక్షను నవంబర్ 15న నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అత్యత ప్రతిభ కనబరిచిన మాస్టర్ విద్వాన్ రెడ్డిని గైడ్ టీచర్లు సంపత్, ప్రదీప్, అకడమిక్ కో ఆర్డినేటర్ నాగరాజుల నిరంతర కృషిని మార్గదర్శకత్వాన్ని పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద రావు, డైరెక్టర్స్ ప్రసూన, అనుకర్ రావు, రశ్మిత, రాకేశ్, వియుయం ప్రసాద్, వినోద్ రావు, హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాలు అందజేసిన మేయర్

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ కార్యక్రమం జరిగింది. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆయన ఛాంబర్‌లో మొదటి విడత కింద నగరంలోని వివిధ డివిజన్‌లకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. మొదటి విడుతలో భాగంగానే నగరపాలక సంస్థ పరిధిలోని మరో 20 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లు జారీ అయ్యాయని ప్రొసీడింగ్ పత్రాలు పొందిన లబ్ధిదారులు మేయర్, కార్పొరేటర్లకు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కళ నెరవేరేలా ప్రభుత్వాలు గృహ పథకాలను ప్రారంభం చేశాయని తెలిపారు. పక్కా గృహాల నిర్మాణం కోసం జారీ చేసిన ఈ ప్రొసీడింగ్ పత్రాల ద్వారా లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణం ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గడ్డి ప్రదీప్, పర్వతం మల్లేశం,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# థాంగ్-టా విజేతలకు కలెక్టర్ అభినందన

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రాష్ట్రస్థాయి థాంగ్‌టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సనా తబసూమ్, మనోజ్ కార్తిని ప్రత్యేకంగా ప్రశంసించారు.ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి థాంగ్‌టా పోటీల్లో అండర్17 బాలుర విభాగంలో మనోజ్ కార్తి (48 కిలోలు) బంగారు పతకం సాధించాడు. సంప్రిత్ (52 కిలోలు), అద్వైత్ (56 కిలోలు), సాత్విక్ (75 కిలోలు) రజత పతకాలు గెలుచుకున్నారు.అండర్17 బాలికల విభాగంలో కృషిక (75 కిలోలు) రజతం, శ్రీ వర్షిణి (48 కిలోలు) కాంస్య పతకం సాధించారు.అండర్14 బాలికల విభాగంలో సనా తబసూమ్ (41 కిలోలు) బంగారు పతకం కైవసం చేసుకుంది. విద్యార్థుల విజయాల పై పాఠశాల చైర్మన్ మాట్లాడి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి లోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణప్రియ,వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ,సతీష్,విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాల: నిర్ణీత గడువులోగా వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ జగిత్యాలలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కళాశాల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులు, ఇంకా పూర్తి చేయాల్సిన పనుల వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్,ఎమ్మెల్యే వైద్య కళాశాల భవనంతో పాటు హాస్టల్ బ్లాక్, కిచెన్, తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి, వాటి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు



అవసరమైన అన్ని వసతులు కల్పించేలా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు.హాస్టల్ బ్లాక్, కిచెన్, తరగతి గదులతో పాటు కళాశాలకు సంబంధించిన అన్ని నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి,అవసరమైన అన్ని వసతులతో కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడం ప్రజలకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే జిల్లాలోని విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించేందుకు మెరుగైన అవకాశాలు లభించడంతో పాటు, ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. భవన నిర్మాణ పనులతో పాటు విద్యార్థులకు అవసరమైన హాస్టల్, కిచెన్, తరగతి గదులు తదితర మౌలిక వసతులను నాణ్యతతో ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల త్వరితగతిన అందుబాటులోకి వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తదితరులు ఉన్నారు.

## భవన నిర్మాణంతో గ్రామ పరిపాలన సులభం

ప్రజాపక్షం/మల్లాపూర్ : రాఘవపేట గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలన సౌకర్యాలు అందించేలా విబిజి రామ్ నిధులతో నూతన గ్రామపంచాయతీ నిర్మాణానికి నాంది పలికినట్లు గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ అన్నారు.ఈ మేరకు శనివారం నిర్మాణ దశలో ఉన్న భవనానికి ప్రధానమైన స్లాబ్ పనులను ప్రారంభించి పూర్తి చేశారు.మరి కొద్ది రోజుల్లోనే భవనాన్ని పూర్తిచేసి గ్రామ ప్రజలకు నూతన భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన పరిపాలనను అందిస్తామని సర్పంచ్ తెలిపారు.సర్పంచ్ వెంట పిఆర్ ఏఇ రాగసుధ,పంచాయతీ కార్యదర్శి మోహన్, ఉప సర్పంచ్ నరసయ్య,పంచాయతీ పాలకవర్గ సభ్యులు,తదితరులు ఉన్నారు.

## గంగుల చొరవతో బిటిరోడ్డు నిర్మాణం పూర్తి

ప్రజాపక్షం /కొత్తపల్లి : కరీంనగర్ రూరల్ మండలంలోని చర్లబూత్కూర్, ప్రశాంత్ నగర్, దుబ్బపల్లి గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవతో ఆయా గ్రామాలకు అనుసంధానంగా బిటిరోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గంగుల కమలాకర్ మంత్రిగా ఉన్న సమయంలో ఈ రహదారి నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించారు. అనంతరం పనులు కొంతమేర ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మరోసారి ప్రత్యేక చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేయడంతో రహదారి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమై



పూర్తయ్యాయి. దీంతో చర్లబూత్కూర్, ప్రశాంత్ నగర్, దుబ్బపల్లి గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడిందని పార్టీ మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ రెడ్డి స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ నూతన బిటి రోడ్డుపై ప్రయాణించి సంతోషం వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణం పూర్తి కావడంతో సౌకర్యం కలిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హరీష్ రావును కలిసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్ రెడ్డి

ప్రజాపక్షం/పెద్దపల్లి : బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ శాసనసభలోబిఆర్ఎస్ ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావునుబిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,రామగుండం నియోజకవర్గ నాయకులు వ్యాల హరీష్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా హరీష్ రావుకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రామగుండం నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు.అదేవిధంగా సింగరేణి బొగ్గు గని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం, కార్మికుల హక్కులకు సంబంధించిన అంశాలను కూడా హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లారు.రామగుండం పారిశ్రామిక ప్రాంత అభివృద్ధితో పాటు సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం,కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. కాగా రామగుండం నియోజకవర్గ ప్రజల సమస్యలు,సింగరేణి కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై పార్టీ నాయకత్వంతో చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## 27, 28, 29 తేదీల్లో ధర్మపురిలో ప్రజా చైతన్య సభలు

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ పిలుపు

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారం,ప్రజా హక్కుల సాధనే లక్ష్యంగా సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజా చైతన్య ప్రస్థానాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు లెల్లెల బాలకృష్ణ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో ధర్మపురిలో ప్రజా చైతన్య సభలు నిర్వహిస్తున్నామని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాటు,ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. రైతులు,వ్యవసాయ కార్మికులు,కూలీలు, నిరుద్యోగులు ,పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో



ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజా చైతన్య సభల్లో రైతులు, కార్మికులు, వ్యవసాయకూలీలు,మహిళలు,యువకులు,ప్రజాసంఘాల నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రస్థానాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సిపిఎం జగిత్యాల జిల్లా ఇన్చార్జి నాయిని శారద,జిల్లా కమిటీ సభ్యుడు కుంచం శంకర్, మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఆసాది సుజాత,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బండపల్లి రాజశేఖర్,ఎస్ఎఫ్ఐ జిల్లా కోకన్వీనర్ సుద్దాల అమితేష్,పాల్గొన్నారు.

## ఎశమేని గణేష్ కుటుంబానికి ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లికి చెందిన ఐఎన్‌టియుసి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎశమేని గణేష్ నానమ్మ రాజవ్వ ఇటీవల మృతి చెందడంతో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆయన నివాసానికి వెళ్లి రాజవ్వ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గణేష్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అంగడి పురుషోత్తం, మాజీ కౌన్సిలర్ బంగారుకాళ్ల కిషోర్,జక్కం బాబు,194 వార్డు ఇన్చార్జి ఆకుల ప్రవీణ్,తదితరులు పాల్గొన్నారు.

## ‘ఖేత్ బచావో అభియాన్’పై రైతులకు అవగాహన

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని ఇస్రాజుపల్లె గ్రామంలో ‘ఖేత్ బచావో అభియాన్’ కార్యక్రమంలో భాగంగా శనివారం,భూసార పరిరక్షణ,సేంద్రీయ ఎరువుల వినియోగం పై మండల వ్యవసాయ అధికారి బొట్ల కరుణ రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎఒకరుణ మాట్లాడుతూ రైతులు పంటల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటిస్తూ భూసారాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రస్తుత ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే యాసంగి (రబీ) సీజన్లలో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని,అందువల్ల రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు ప్రత్యామ్నాయ ంగా..తక్కువ నీటితో పండే మొక్కజొన్న,పెసర,మినుము,వేరుశనగ, నువ్వులు, అలాగే కూరగాయల పంటలను సాగు చేసుకోవాలని కోరా రు.ఇలాంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకుని , అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు వివరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు,వ్యవసాయ విస్తరణ అధికారి (ఎఇఒ) మహేష్,సీఆర్పీ స్రవంతి,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బీర్‌పూర్ లీగ్‌లో ‘మంగేళ’ జోరు.. సీనియర్ క్రీడాకారుడికి విజయ కానుక!

ప్రజాపక్షం/బీర్‌పూర్ : జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన క్రీడాకారులు క్రికెట్ టోర్నమెంట్‌లో విజయం సాధించి గెలుచుకున్న కప్‌ను సీనియర్ క్రీడాకారుడైనా గ్రామ ఉపసర్పంచ్ శ్రీ దగ్గుల వీరేశంకి స్థానిక సర్పంచ్ శ్రీ బనక సతీష్ చేతుల మీదుగా అందజేశారు.దసరా సెలవుల లో నిర్వహించిన బీర్‌పూర్ ప్రీమియర్ లీగ్ 11 టోర్నమెంట్‌లో గెలిచిన కప్‌ను గ్రామ ఉపసర్పంచ్‌కు అంకితం చేసిన యువకులుమంగేళ గ్రామానికి చెందిన యువకులు టోర్నమెంట్‌లో విజయం సాధించి గెలుచుకున్న కప్‌ను గ్రామ ఉపసర్పంచ్ శ్రీ దగ్గుల వీరేశంకి అంకితం చేశారు.ఈ సందర్భంగా గ్రామ యువకులు తమ విజయానికి గుర్తుగా సాధించిన కప్‌ను ఉపసర్పంచ్‌కు అంకితం చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.యువత చూపించిన అభిమానం,ఆప్యాయత,గౌరవం పట్ల ఉపసర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు .ఈ సందర్భంగా ఉపసర్పంచ్ దగ్గుల వీరేశం మరియు సర్పంచ్ బనక సతీష్ మాట్లాడుతూ యువత మత్తు పానీయాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల వైపు అడుగులు వేయాలని వారు పిలుపునిచ్చారు.



క్రీడలు శరీరానికి దృఢత్వాన్ని, మనసుకు ఉల్లాసాన్ని అందించడంతో పాటు ఆత్మవిశ్వాసం,క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి గ్రామంలో యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.గ్రామ యువకులు సాధించిన విజయాలు మరింత మంది యువతకు స్ఫూర్తిగా నిలవాలని,భవిష్యత్తులో మరిన్ని టోర్నమెంట్లలో పాల్గొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గ్రామ యువకులు టోర్నమెంట్‌లో విజయం సాధించి, ఆ కప్‌ను తనకు అంకితం చేయడం ఎంతో ఆనందంగా,గర్వంగా ఉందని పేర్కొన్నారు. యువత క్రీడల్లో మరిన్ని విజయాలు సాధిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. యువతలో ఐక్యత, క్రీడాస్ఫూర్తి, పెద్దల పట్ల గౌరవం ఉండటం అభినందనీయమని తెలిపారు.తనపై ప్రేమాభిమానాలతో కప్‌ను అంకితం చేసిన యువకులకు ఉపసర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బనక సతీష్, పంచాయతీ కార్యదర్శి అజ్మీరా వినోద్,వార్డు సభ్యులు గురునాథం మల్లారెడ్డి లగన్ టీం సారథి దాసరి వెంకటేష్,రాస శంకర్,రౌతు రంజిత్, రాజేందర్ ,రౌతు నరేందర్,పెనగొండ నాగరాజు,మోతె నరేష్ ,బొంద్ల వినోద్ రాంబంటు,పడిగెల అభి, బూస నవీత్, బనుక నాగచైతన్య, బూస రాకేష్, మోతె రాజేష్,జైనపురం సాయికుమార్ గుమ్ముల రమేష్ మనోజ్ ,అకీర్త విష్ణు, ఎల్లేశ్వరం చరణ్,నారపాక లక్ష్మణ్ ,తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

## గురుద్వార్‌లో సిపి ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాపక్షం / కొత్తపల్లి : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా స్థానిక గురుద్వార్‌లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమాజ రక్షణ కోసం, శాంతి భద్రతల పరిరక్షణలో విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుతూ గురుద్వారలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది క్షేమం, ప్రజా సంక్షేమం కోరుతూ గురుద్వారా ప్రబంధక్ కమిటీ సభ్యులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ సమాజ శాంతి కోసం అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీతో పాటు ఏసీపీలు వెంకటస్వామి, విజయ్‌కుమార్, టౌన్, ట్రాఫిక్ సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, గురుద్వార ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజం మృతి తీరని లోటు: ఎమ్మెల్యే సంజయ్



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ఇటీవల రాఘవపేట గ్రామానికి చెందిన బైరి నడిపి రాజం మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శనివారం పరామర్శించారు.తన చిన్ననాటి నుండి రాజంతో ఉన్న అనుబంధం ఎనలేనిదని, ఆయన మృతి తీరని లోటును మిగిల్చిందని భావోద్వేగానికి గురయ్యారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్, పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఉప సర్పంచ్ నరసయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజ్ కుమార్,నాయకులు బైరి రవికుమార్,తోట సంతోష్, రాకేష్,రాజకుమార్,సాగర్,ఎర్రన్న పెద్ద రాజం, తదితరులు ఉన్నారు.

## యాసంగిలో వరి పంట సాగు చేసి నష్టపోవద్దు



**ప్రజాపక్షం/మల్లాపూర్:** ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రత పెరిగి ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు పూర్తి భిన్నంగా మారాయని వచ్చే వేసంగిలో రైతులెవ్వరు వరి పంట సాగు చేసి నష్టపోవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారిని లావణ్య అన్నారు.ఈ మేరకు శనివారం సాతారం గ్రామపంచాయతీ ఆవరణలో సాగు సంరక్షణ (ఖేతి బచావో అభియాన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. నీటిని పొదుపుగా వాడుకొని ఆరుతడి పంటలను సాగు చేసుకుని లబ్ధి పొందాలని పెసర, జనుము,నువ్వులు విత్తనాల లభ్యత ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెక్కపల్లి కిషన్ గౌడ్ ఎమ్మార్వో రామచందర్, ఆర్ ఐ అశోక్, ఆత్మ కమిటీ చైర్మన్ భూమారెడ్డి,పంచాయతీ కార్యదర్శి వినోద్, గ్రామ రైతులు,తదితరులు ఉన్నారు.

# అంతర్రాష్ట్ర దోపిడీ ముఠాపై పిడి యాక్ట్ అమలు

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ పట్టణంలో సంచలనం సృష్టించిన భారీ దోపిడీ కేసులో నిందితులైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పిడి యాక్ట్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత జూలై 21, 2026 అర్ధరాత్రి వేళ కరీంనగర్ పట్టణంలోని భగత్ నగర్‌లో నివాసముంటున్న మహ్మద్ అజ్మత్ అలీ ఇంట్లోకి ఈ ముఠా సభ్యులు చొరబడ్డారు. డమ్మీ తుపాకులు, కత్తులతో బెదిరిస్తూ అజ్మత్ అలీతో పాటు కుటుంబ సభ్యులపై దాడికి తెగబడ్డారు. ఇంట్లోని వృద్ధులు, మహిళలను విచక్షణారహితంగా కొట్టి, వారిని ఒక గదిలో బంధించి రూ. 25 లక్షల నగదు, బంగారం, వెండి ఆభరణాలు ,రెండు మోటార్ సైకిళ్లతో సహా సుమారు రూ. 43 లక్షల విలువైన సొత్తును దోచుకెళ్లారు. ఈ దోపిడీ కేసుపై సమగ్ర విచారణ చేపట్టిన పోలీసులు ఆగస్టు నెలలో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. సమాజ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఇలాంటి కరడుగట్టిన నేరస్థులపై కఠిన చర్యల్లో భాగంగా శనివారం పోలీస్ కమిషనర్ పిడి యాక్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. పిడి యాక్ట్ నమోదైన నిందితులు మహ్మద్ రజావుద్దీన్, మహ్మద్ అజీమ్ రజా, సల్మాన్ అలియాస్ భూరే, సల్మాన్ అలియాస్ విమన్, మహ్మద్ హసీన్ .(అందరూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, మీరట్ నగరం, మదీనా కాలనీ నివాసితులు) ఈ అంతర్రాష్ట్ర ముఠాపై పిడి యాక్ట్ అమలు చేయడంలో కీలక పాత్ర పోషించి, కేసు దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించిన కరీంనగర్ పట్టణ ఎసిపి ఎన్. వెంకటస్వామి, ఒకటవ పట్టణ సిఐ కె. రాంచందర్ రావులను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం / చందుర్తి :** చందుర్తి మండల సాధారణ సర్వసభ్య సమావేశం మండల ప్రత్యేక అధికారి శ్రీధర్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాదాసీదాగా సాగింది. ఈ కార్యక్రమానికి పలువురు శాఖల అధికారులు హాజరై నివేదికలు సమర్పించారు.మండల వ్యవసాయ శాఖ అధికారి దుర్గరాజు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలు త్వరితగతిన ఏర్పాటు చేసి సక్రమంగా నిర్వహించాలని , ఎరువుల కొరత లేకుండా రైతులకు అందించాలని తిమ్మాపూర్ సర్పంచ్ కాపిల్ల శంకర్ కోరారు.2018 సంవత్సరం తర్వాత పట్టాలు పొందిన అర్హులైన రైతులకు అందరికి కిసాన్ సమ్మాన్ నిధులు అందజేయాలని బండపల్లి సర్పంచ్ కటకం మల్లేశం కోరారు.మిషన్ భగీరథ నీళ్ళు రావడం లేదని పలుమార్లు విన్నవించిన ఏడాది కాలంగా పట్టించుకోవడం లేదని దేవునితండా సర్పంచ్ భూక్య మోహన్ మిషన్ భగీరథ ఏయి మయూరిని నిలదీయగా వారం రోజుల్లో మోటారు ఏర్పాటు చేసి నీటిని అందిస్తామన్నారు.తమ గ్రామానికి అంగన్వాడి కార్యకర్తను నియమించాలని దేవునితండా సర్పంచ్ భూక్య మోహన్ కోరగా ఐసిడిఎస్ సూపరవైజర్ శంకరమ్మ మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తల నియామక ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ఒకేసారి జరుగుతుందని , రానున్న రెండు మూడు నెలల్లో అంగన్వాడి కార్యకర్త నియామకం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హజరయ్యారు. ఎంపిడిఓ రాధ , ఎంఆర్ఓ భూపతి , ఫ్యాక్స్ చైర్మన్‌లు గసికంటి ప్రభాకర్ ,ఏగోళం శ్రీనివాస్ , ఎఎంసి చైర్మన్ చెల్కల తిరుపతి ,ఏఎంసి వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం , ఆత్మ కమిటీ చైర్మన్ ముకుంద రెడిపాల్గొన్నారు.

# నృసింహుడిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని శనివారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింగ్‌రావు నందికొండ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభం, మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రధానాలయం శ్రీ యోగానంద లక్ష్మీ నృసింహ దేవాలయంలో జస్టిస్ నర్సింగ్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు .అనంతరం నిత్య పూజా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన స్వామివారి అభిషేకం,నారసింహ హోమం కార్యక్రమాలలో పాల్గొన్నారు.పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో వేదపండితులు,అర్చకులు న్యాయమూర్తికి ఆశీర్వచనం అందజేశారు.దేవస్థానం తరపున కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం,ప్రసాదం, చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రత్న పద్మావతి,స్థానిక మెజిస్ట్రేట్ యోగి జానకి,స్థానిక తహసీల్దార్



ఏరుకొండ శ్రీనివాస్,బుగ్గారం,వెల్గటూర్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్,ఉదయ్‌కుమార్, దేవస్థానం సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్,వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ఓంకార శర్మ,ముఖ్య అర్చకులు రమణయ్య,అర్చకులు నంబి నరసింహమూర్తి,అభిషేక పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్ కుమార్,రాజగోపాల్,తదితరులు పాల్గొన్నారు.

# గత సమస్యలు తీరలేదు... కొత్తవి ఎప్పుడు చేస్తారు?

### మండల సమావేశంలో అధికారుల తీరుపై సర్పంచ్‌ల ఆగ్రహం

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తీవ్ర అసంతృప్తి, సర్పంచుల నిరసనల మధ్య సాగింది, ఈ సమావేశం ఆలస్యంగా ప్రారంభంకావడమే కాకుండా, పూర్తిస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకాకపోడం గమనార్హం. వివిధ శాఖల అధికారుల పనితీరుపై, గ్రామాల అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యంపై సమావేశంలో పాల్గొన్న సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారి క్రాంతికుమార్, ఎంపీవో బీరయ్య, తహసీల్థార్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న పలు కీలక సమస్యలపై విసృతంగా చర్చించారు. రాబోయే రోజుల్లో ఎలీనో ప్రభావం తీవ్రంగా ఉంటుం



దని అధికారులు పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపేలా గ్రామ సర్పంచ్‌లు చొరవ చూపాలని అధికారులు కోరారు. అలాగే పలు శాఖల అధికారులు ఇప్పటి వరకు జరిగిన పనుల, భవిష్యత్తులో చేపట్టే పనుల వివరాలను వెల్లడించారు. అనంతరం కంచర్ల గ్రామ సర్పంచ్ సామల్ల దేవరాజు మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా వరిధాన్యం ఆరబెట్టడానికి అనువైన ప్రదేశాన్ని అటవీశాఖ అధికారులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్రామాభివృద్ధి పనులకు ఇసుక కొరత వేధిస్తోందని, స్థానికంగా ఉండే ఇసుక వనరులను ఉపయోగించుకునేందుకు వెసులుబాటు కల్పించాలని, మండల పరిధిలోనే వీటికి సంబంధించిన అనుమతులు ఇచ్చి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సర్పంచ్‌లు కోరారు. మద్దిమల్ల గ్రామంలోని రైతులు లోవోల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ ప్యాట్ల రవి డిమాండ్ చేశారు. గత సమావేశంలో విన్నవించిన ఏ ఒక్క సమస్య కూడా ఇప్పటివరకు పరిష్కారం కాలేదని సర్పంచ్‌లు మండిపడ్డారు. అధికారుల తీరు ఇలాగే కొనసాగితే వచ్చే సమావేశాన్ని బహిష్కరిస్తామని, హాజరు కాబోమని హెచ్చరించారు. మొత్తం 17 గ్రామాల సర్పంచ్లలో కేవలం 9 మంది మాత్రమే పాల్గొన్న ఈ సమావేశం, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సర్పంచుల నిలదీతలతో రసవత్తరంగా ముగిసింది.

## ట్రస్మా నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం / చందుర్తి :** చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని ప్రతిభ విద్యాలయం పాఠశాలలో చందుర్తి మండల ట్రస్మా సమావేశం మండల ట్రస్మా అధ్యక్షుడు , పాఠశాల కరస్పాండెంట్ కొడగంటి గంగాధర్ అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేయగా చందుర్తి మండల ట్రస్మా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రాజూరి సద్గుణాచారి , ఉపాధ్యక్షుడిగా ఏనుగుల కృష్ణ , కోశాధికారిగా కొడగంటి గంగాధర్ , కార్యవర్గ సభ్యులుగా పత్తిపాక నాగరాజు , చెన్నమనేని రాజేశ్వర్ రావు , లింగాల లింగయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బాధిత ప్రజలకు అండగా నిలుస్తాం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** వినియోగదారుల,మానవ హక్కుల పరిరక్షణ,ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ప్రతిష్టాత్మక సంస్థ ఉపభోక్త ఏవం మానవ అధికార్ రక్షా సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్లపెల్లి విజయసాగర్ నియమితులయ్యారు.ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షుడు ఆర్.కె. జైన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సహారా బాను సూచనలు,సలహాల మేరకు జాతీయ నాయకత్వం ఈ నియామకాన్ని ఖరారు చేసింది.ఈ సందర్భంగా నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లపెల్లి విజయసాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ, పోలీస్ లేదా ఇతర అధికార యంత్రాంగం సకాలంలో స్పందించని పక్షంలో సంస్థ తరపున బాధితులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.ప్రజల గోడును,సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి,వారితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వినియోగదారుల హక్కులు,మానవ హక్కులపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామని,బాధితులకు న్యాయం జరిగేలా సంస్థ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

## రూ.14.76 కోట్ల నిధులు మంజూరు

**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని నియోజకవర్గ పరిధిలోని 5 మండలాల్లో నూతన గ్రామ పంచాయతీ, అంగన్వాడీ, ఎస్.హెచ్.జి మహిళా గ్రూప్ వివో భవనాల నిర్మాణ పనుల కోసం తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు రూ. 14 కోట్ల 76 లక్షల నిధులను మంజూరు చేయించారు. విబి. జి రాంజీ 2026–27 ఎంజిఎన్ఆర్ఇజిఏ పథకం కింద ఈ నిధులను కేటాయించారు.ఇందులో భాగంగా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి ఒక్కో కేంద్రానికి రూ. 10 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు అధికారులు, కాంగ్రెస్‌జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బియ్యని శివకుమార్‌లు తెలిపారు. నిధులు మంజూరైన గ్రామాల్లో అడవిశ్రీరాంపూర్, హరిపురం,ఇప్పలపల్లి, జిల్లెల్లపల్లి, కేశనపల్లి (సెంటర్1, సెంటర్2), ముత్తారం (సెంటర్1, సెంటర్2, సెంటర్3), మైదంబండ,పారుపల్లి, పోతారం,సీతంపేట, ధర్యాపూర్, ఓడేడు, మచ్చుపేట, ఖమ్మంపల్లి,లక్కారం గ్రామాలు ఉన్నాయి. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ భారీగా నిధులు మంజూరు చేయించినందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు మంత్రి శ్రీధర్ బాబుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మోడల్ పాఠశాలలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడి సందర్శన

**ప్రజాపక్షం/ముత్తారం :** ఐటీ,ఇండస్ట్రీస్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు,యువ నాయకులు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు దర్యాపూర్ గ్రామంలోని తెలంగాణ స్టేట్ మోడల్ పాఠశాల,కళాశాలను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్‌పిటిసి చొప్పరి సదానందం స్థానిక సర్పంచ్ రాపెల్లి రాజయ్య తోకలిసి శనివారం సందర్శించారు.ఈ సందర్శనలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యాసేవలను,అక్కడ ఇంకా కావాల్సిన అవసరమైన వసతులు,మౌలిక సౌకర్యాల గురించి ఆయన అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో దర్యాపూర్ గ్రామ సర్పంచ్ రాపెల్లి రాజయ్య,కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ కేసరి,పాఠశాల ఉపాధ్యాయ బృందం,సిబ్బంది.స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి




**ప్రజాపక్షం/మందమర్రిః** రైతులంతా ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి (ఎఇఒ) రాజశేఖర్ సూచించారు. శనివారం మందమర్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ రకాల రాయితీలు పొందడంతో పాటు ఎరువుల బుకింగ్ చేసుకోవడానికి రైతు ఐడి అవసరమని స్పష్టం చేశారు. మందమర్రి క్లస్టర్ పరిధిలోని రైతులు ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు సమీపంలోని ఎఇఒను సంప్రదించి లేదా మీసేవ కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆండ్రాయిడ్ యాప్ ద్వారా కూడా నమోదు చేసుకునే అవకాశం ఉందని వివరించారు. రైతులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు.

## అదిల్‌పేటలో 29న లక్ష్మీ దేవర ఆలయ ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం / మందమర్రిః** మందమర్రి మండలంలోని అదిల్‌పేట గ్రామంలో లక్ష్మీ దేవర ఆలయ ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం అదిల్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వేద మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

## టిజెఎ జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడికి సన్మానం

**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ః** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిజెఎ) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన షఫీ ఉల్లా బేగ్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎర్ర రాజశేఖర్‌లను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షకీల్ సన్మానించారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అబ్దుల్ షకీల్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి షఫీ ఉల్లా బేగ్ చేసిన కృషికి తగిన గుర్తింపు లభించిందన్నారు. గ్రామీణ రిపోర్టర్‌గా ప్రస్థానం ప్రారంభించి జిల్లా అధ్యక్షుడి స్థాయికి ఎదగడం అభినందనీయమని కొనియాడారు.

# నాయక్‌పోడ్ విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ నాయకపోడ్ విద్యార్థులు, నిరుద్యోగులు కుల ధృవీకరణ (క్యాస్ట్ వెరిఫికేషన్)లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం అధ్యక్షులు గాండ్ల రాంచందర్, గౌరవ అధ్యక్షులు బండారి భోజన్న కోరారు. శనివారం హైదరాబాద్ సచివాలయంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరించగా ఈ సమస్యలపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో చర్చించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నాయక్‌పోడ్ విద్యార్థులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. నాయక్‌పోడ్ విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి నాయక్‌పోడ్ సామాజిక వర్గం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. పాల్గొన్న వారి జిల్లా కార్యవర్గ సభ్యులు ఉన్నారు.



## లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి జైలుశిక్ష

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** మహిళలు, బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్య అన్నారు. శుక్రవారం బాలికపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులో నిందితుడికి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి దుర్గాప్రసాద్ తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే.. 2021 సెప్టెంబర్‌లో నిజామాబాద్‌లో ఐదేళ్ల బాలికపై నిందితుడు మాచా రవీంద్రనాథ్ అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు పాల్పడినట్టు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైం నెంబరు 236 /2021 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసులో భారతీయ శిక్షా స్మృతి ఐపిసి సెక్షన్ 354 డి కింద నిందితుడికి ఐదు సంవత్సరాల జైలుశిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా, అలాగే పోక్సో చట్టంలోని సెక్షన్ 9 కింద ఏడు సంవత్సరాల జైలుశిక్షతోపాటు రూ. 10 వేల జరిమానా విధిస్తు ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి దుర్గాప్రసాద్ తీర్పు వెలువరించారు.నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసి, కేసు విచారణలో కీలకంగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని నిజామాబాద్ పోలీసు కమీషనర్ ప్రత్యేకంగా అభినందించారు.



## నేడు టిఎవివివి జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

**ప్రజాపక్షం / మంచిర్యాల టౌన్ :** తెలంగాణ ఆర్యవైశ్య విద్యావంతుల వేదిక (టిఎవివివి) మంచిర్యాల జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం సాయంత్రం 6 గంటలకు జిల్లా కేంద్రంలోని హైలైఫ్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు నూతన అధ్యక్షుడు కుంకుముట్టి వెంకటేశ్ తెలిపారు. శనివారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఆర్యవైశ్యులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటైన టిఎవివివి సేవలను విస్తరిస్తున్నామన్నారు. రెండేళ్ల కాలపరిమితితో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరిస్తోందని వెల్లడించారు. జిల్లాలో వ్యాపార వర్గాలతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, న్యాయవాదులు, విద్యుత్ సంస్థల ఉద్యోగులు, డిగ్రీ పూర్తి చేసిన యువతను కలుపుకొని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. రూ.500 చెల్లించి జీవితకాల సభ్యత్వం తీసుకునే అవకాశాన్ని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నుంచి సుమారు 200 మందిని జీవితకాల సభ్యులుగా చేర్చుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమానికి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బల్లు చంద్రప్రకాశ్ గుప్తా ముఖ్య అతిథిగా, ఇన్స్టాలేషన్ అధికారిగా హాజరుకానుండగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి సుధాకర్, కోశాధికారి సిరిపురం శ్రీనివాస్, చీఫ్ అడ్వైజర్ కె.వి.ప్రతాప్ పాల్గొననున్నారు. వీరితో పాటు పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ జిల్లాల బాధ్యులు పెద్ది వెంకటేశ్, సిరిపురం ఈశ్వర్, పెద్ది ఆంజనేయులు, స్థానిక ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా కాసం మల్లికార్జున్, కోశాధికారిగా గుల్బం శ్రీధర్, ప్రథమ ఉపాధ్యక్షుడిగా నెరెళ్ళ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

## బొగ్గు రవాణా కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి

**ప్రజాపక్షం / రెబ్బనః** ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్ నుంచి గోలేటి సిహెచ్ పికి బొగ్గు రవాణా చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లాభాల వాటా రూ.5,500 వెంటనే చెల్లించాలని ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు భోగే ఉపేందర్, టిబిసికెఎస్ ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. శనివారం బెల్లంపల్లి ఏరియా పరిధిలోని గోలేటి జిఎం కార్యాలయంలో డిజిఎం పర్సనల్ కిరణ్ కుమార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. బొగ్గు రవాణా ద్వారా సింగరేణి సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంలో లారీ డ్రైవర్లు, క్లీనర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సంస్థకు లాభాలు తీసుకురావడంలో నిరంతరం శ్రమిస్తున్న కార్మికులకు లాభాల వాటా అందించడంలో జాప్యం చేయడం తగదన్నారు. అర్హులైన లారీ డ్రైవర్లు, క్లీనర్లకు రూ.5,500 వెంటనే చెల్లించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు భోగే ఉపేందర్, టిబిసికెఎస్ ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు పాల్గొన్నారు.

## నాసిరకం సరుకుల నాకాఫ్ టెండర్ రద్దు చేయాలి



**ప్రజాపక్షం / మందమర్రిః** మంచిర్యాల జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్న నాకాఫ్ సంస్థ టెండర్‌ను తక్షణమే రద్దు చేయాలని విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మందమర్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెజిబివి, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ గురుకులాల్లో 30 రకాల సరుకులకు బదులు 15 రకాలే ఇస్తున్నారని, వాటిలోనూ పురుగులు ఉంటున్నాయని ఆరోపించారు. నాణ్యత లేని సరుకులతో విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి, పాత టెండర్ రద్దు చేసి నాణ్యమైన సరుకులు సరఫరా చేసే సంస్థకు బాధ్యతలు అప్పగించాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఆరుతడి పంటలపై అవగాహన



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని రైతులకు మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్ ఆరుతడి పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని దొన్కల్ గ్రామలంఓ శనివారం మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని భూగర్భజలాలు రోజురోజు తగ్గిపోవటంతో వరి పంటకు నీరందటం కష్టమవుతుంది కావున రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని తెలిపారు. రైతులు వేయవల్సిన ఆరుతడి పంటలు మొక్కజొన్న, జొన్న, పెసర, మినుములు, నువ్వులు, కంది పంటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేథ్ బచావో అభియాన్ కార్యక్రమంపై తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరీష్‌కుమార్, దొన్కల్ గ్రామసర్పంచ్ అనిల్, వ్యవసాయ విస్తీర్ణాధికారి భార్గవ్, ఉపసర్పంచ్ భూమన్న, అధికారులు రైతులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై భారీ గుంత



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లిః** మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంత ప్రయాణీకులకు చుక్కలు చూపిస్తోంది. ఈ రహదారి గుండా జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు కార్లు, బస్సులు, లారీలు, ఇతర వాహనాలు వేల సంఖ్యలో నడుస్తాయి. ఈ మార్గంలో ప్రయాణించే విషయంలో కాస్త ఆదమరిస్తే చాలు, ప్రమాదాల బరిన పడక తప్పడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నడిబొడ్డున్న ఉన్న ఈ గుంత కారనంగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ముఖ్యంగా రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదమరిస్తే ప్రమాదం తప్పదని భావిస్తున్నారు. స్థానిక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పలుమార్లు మరమ్మతులు చేయించిన తిరిగి అదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్,బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైకిల్ / బైక్ ర్యాలీని ఈనెల 25వ తేదీ ఆదివారం ఉదయం 7.30 గంటలకు పూలాంగ్ చౌరస్తా నుండి కోర్టు చౌరస్తా, పోలీస్ హెడ్ క్వార్టర్స్ వరకు సైకిల్ / బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నట్టు పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. కావున పెద్ద ఎత్తున ప్రజలు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నేల, నీటి పరిరక్షణతోనే వ్యవసాయాభివృద్ధి

**ప్రజాపక్షం / వాంకిడిః** సాగుభూముల సంరక్షణ ప్రతి రైతు బాధ్యత అని వ్యవసాయ విస్తరణ అధికారులు (ఎఇఒలు) దగం మానస, తాండవం కృష్ణ అన్నారు. వాంకిడి మండలం అర్లి గ్రామంలో నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ సదస్సులో వారు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూసారాన్ని కాపాడుకుంటూ, సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచాలని, నేల కోతను అరికట్టి భూమిలో తేమను నిలపడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రకృతి వనరులను కాపాడుకుంటూ చేసే వ్యవసాయం దీర్ఘకాలిక లాభాలనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అర్లి సర్పంచ్ ఆడ అరుణ, ఎఇఒలు దగం మానస, తాండవం కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## లోకేశ్వరంలో గజాలమ్మ బోనాలు



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని గజలమ్మ ఐదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు గజ్జలమ్మ ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రోజున గజ్జలమ్మ బోనాలు శోభ యాత్ర నిర్వహించడం ఊరేగింపు చేయడం జరిగిందని పోతరాజులు,శివసత్తులు పాల్గొని ఆటపాటలతో నృత్యాలతో అలరించారు.ఆదివారం రోజున గజ్జలమ్మ ఐదవ వార్షికోత్సవం,అభిషేకాలు అర్చనలు నిర్వహించి అన్నదాన ప్రసాదం ఉంటుందని తెలిపారు.

## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాపక్షం/తానూర్ :** తానూర్ మండలంలో బాధిత కుటుంబాలను శనివారం మాజీ ఎమ్మెల్యే, ముధోల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి భోస్లే నారాయణరావు పటేల్ పరామర్శించారు.మొదట బోర్గావ్ గ్రామంలో సిందే సుభాష్ కుటుంబాన్ని కలిసి సానుభూతి తెలిపారు. అనంతరం బెంబెర్ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ గడపాలె బాబురావు కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు.

రెండు కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. భైంసా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే,తానూర్ మండల అధ్యక్షుడు హెచ్. పుండ్లిక్,మాజీ కో ఆప్షన్ మెంబెర్ చంద్రకాంత్ యాదవ్,ఎస్సీ విభాగ్ అధ్యక్షుడు పవార్ సాయినాథ్,గోవింద్ పటేల్,సర్పంచ్ మారుతి పటేల్,లక్ష్మ ణ్ ,తదితర నాయకులు ఉన్నారు.

## వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టు

### ఎఎస్‌పి సాయి కిరణ్

**ప్రజాపక్షం/భైంసా :** వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టు భైంసా రూరల్ పోలీసులు రట్టు చేశారు.ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.వారి నుంచి 170 తులాల వెండి ఆభరణాలు,13 గ్రాముల బంగారు ఆభరణాలు,రూ.22 వేల నగదుతో పాటు రెండు మోటార్ సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

భైంసా ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ సాయి కిరణ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ముధోల్ మండలం ఎడ్బిడ్ గ్రామానికి చెందిన అర్సాల పెద్ద సాయన్న,సంగొల్ల భూమేష్,భుదుబుక్కల గంగన్నతో పాటు నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కాంతం గ్రామానికి చెందిన బైరుపుల పందరి, బైరుపుల కుమార్‌లను నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు.

నిర్మల్ జిల్లాలోని భైంసా, ముధోల్, పిప్రి, పెండ్పల్లి, తిమ్మాపూర్, హంపోలికెతో పాటు లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో నిందితులు దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని ఏఎస్పీ తెలిపారు.

## మాకొద్దు బాబోయ్ ఆ స్టేషన్..!




**ప్రజాపక్షం / చెన్నూరుః** పోలీస్ స్టేషన్‌లో సిఐ వేధింపులు భరించలేక 'మమ్మల్ని బదిలీ చేయండి మహాప్రభో' అంటూ పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని ఓ ప్రధాన పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిఐ వ్యవహారశైలిపై తోటి సిబ్బంది, కింది స్థాయి అధికారులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. గతంలో సదరు సిఐ వేధింపుల వల్లే సతీష్ అనే కానిస్టేబుల్ గుండెపోటుతో మరణించాడని మృతుడి భార్య ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టించింది. ఆరు నెలల క్రితం ఆయన పనిచేస్తున్న స్టేషన్‌లోనే మరో కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం తీవ్ర ఆరోపణలకు దారితీసింది. ఆ సమయంలో సిఐపై చర్యలు ఉంటాయని అంతా భావించినప్పటికీ, కీలక అధికారుల అండదండలతో సిఐని కేవలం మందలించి వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. ఆత్మహత్యాయత్నం చేసుకున్న కానిస్టేబుల్‌ను కొద్ది రోజులు జైపూర్ ఎసిపి కార్యాలయానికి అటాచ్ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారనే ప్రచారం జరిగింది. అయినా సదరు సిఐ తీరు మారకపోవడంతో ఎస్ఐలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేధింపులు తాళలేక ఇటీవలే ఓ ఎస్ఐ పెద్దపల్లికి, ఆరు నెలల క్రితం మరో ఎస్ఐ తిర్యాణికి, మరో హెడ్ కానిస్టేబుల్ వేరే ప్రాంతానికి బదిలీ చేయించుకున్నట్లు స్టేషన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో పోలీస్ స్టేషన్‌లోనే మరో శాఖ మహిళా అధికారి పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన వ్యవహారం వివాదాస్పదమైనా అధికార అండదండల వల్లే ఆయనపై చర్యలు లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో కమిషనర్ కార్యాలయం చుట్టూ బదిలీల కోసం తిరుగుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేధింపులకు గురిచేస్తున్న సిఐపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి

**ప్రజాపక్షం/తానూర్ :** ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతు స్వరాజ్ వేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బుర్రన్న, డిమాండ్ చేశారు.మండల కేంద్రానికి చెందిన జాదవ్ బాలాజీ, దొంతుల్వార్ పోశెట్టి,దౌలతాబాద్ గ్రామానికి చెందిన రాజుల వెంకన్న,గత కొన్నేళ్లుగా సరైన దిగుబడి రాకపోవడం,అప్పుల భారం,వరుసగా వాతావరణ ప్రతికూలతలే వారి ఆత్మహత్య చేసుకోవడానికి (మరణానికి) కారణమని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోయాబీన్, పత్తి,కందులు వేసినా పెట్టుబడి కూడా రాలేదని తెలిపారు.శనివారం సంగెపు బొర్రన్న,మాజీ సర్పంచ్ జాదవ్ మాధవ్ రావ్ పటేల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పోశెట్టి,పవార్ భీమ్ రావ్,బాధిత కుటుంబాలను పరామర్శించారు.వారి ఆర్థిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సంగెపు బొర్రన్న మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.జీఓ నంబర్ 194 ప్రకారం ఒక్కో కుటుంబానికి



ఆరు లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబ పెద్దకు నెలకు 5 వేల పెన్షన్,పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.రైతు ఆత్మహత్యలు ఆగాలంటే కేవలం పరిహారం సరిపోదని,గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రైతులకు నెలకు 15 వేల స్థిర ఆదాయం వచ్చేలా ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు,కూరగాయల సాగు,కోళ్ల, గేదెలు,మేకల పెంపకాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## గిరిజనుల కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను పరిష్కరించాలి

### ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ప్రజాపక్షం/బోథ్ :** ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు,ముఖ్యంగా కుల ధ్రువీకరణ పత్రాల జారీలో నెలకొన్న ఇబ్బందుల పరిష్కారంపై బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రత్యేక సమావేశంలో చర్చించారు.హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్తెలంగాణసచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఆధ్వర్యంలో శనివారంనిర్వహించిన సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా గిరిజనుల కుల ధ్రువీకరణ పత్రాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమగ్రంగా పరిశీలించి,అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రాలు అందకపోవడం వల్ల గిరిజన



విద్యార్థులు, యువత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు.సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేస్తూ, అర్హులైనగిరిజనులకు నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపి, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ వీక్లీ పరేడ్ సిబ్బందికి దిశానిర్దేశం

### సిఐ సత్యనారాయణ

**ప్రజా పక్షం /ఖానాపూర్ :** ఖానాపూర్ సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది కోసం శనివారం స్థానిక కళాశాల మైదానంలో వీక్లీ పరేడ్ ను నిర్వహించారు.ఖానాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్ఐలు,ఏఎస్ఐలు సిబ్బంది కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ పోలీసు విధులు అత్యంత బాధ్యతతో కూడుకున్నవని, ప్రజలకు మెరుగైన భద్రత అందించాలంటే పోలీసు యంత్రాంగం శారీరకంగా, మానసికంగా ఎప్పుడూ దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు.క్రమం తప్పకుండా నిర్వహించే



పరేడ్ లు సిబ్బందిలో క్రమశిక్షణ, సమన్వయం, సమయపాలనను పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.అలాగే పోలీసు సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం చేయాలని,చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.

## ఉపాధి కూలీలకు 125 రోజుల పని

### జైనూర్ ఎంపిడిఒ కృష్ణవేణి



**ప్రజాపక్షం/జైనూర్:** జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ వీబీజీ రామ్‌జీ పథకం కింద 125 రోజుల ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని జైనూర్ ఎంపిడిఒ కృష్ణవేణి అన్నారు. శనివారం మండలంలోని పోచంలొద్ది, ఉషేగావ్ గ్రామపంచాయతీల పరిధిలో కూలీలు చేపడుతున్న పనులను పథకం సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. పంట కుంటల నిర్మాణం ద్వారా భూగర్భ జలాల మట్టాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కూలీకి పని కల్పించాలని, ఫామ్ పాండ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణ పనులను అధికంగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆత్రం నిర్మల శశిపాల్, మడావి మనోహర్, ఎపిఒ నగేష్, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపేందర్, లింగేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సురేఖ, ఫీల్డ్ అసిస్టెంట్ దత్త, కూలీలు పాల్గొన్నారు.

## అమెరి కిడ్స్‌లో బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు అమెరి కిడ్స్ ప్రిన్సిపాల్ అజయ్ రావు ఆధ్వర్యంలో పాఠశాలలో రంగురంగుల పూలతో అందంగా పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పండుగ ఘనంగా జరుపుకున్నారు.సంప్రదాయబద్ధంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఆనందోత్సాహాలను నింపాయి.తెలంగాణ ఆత్మీయతకు,ఐక్యతకు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ భక్తిశ్రద్ధలతో,గౌరమ్మకు పూజలు నిర్వహించి ఆనందంగా జరుపుకున్నారు. విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వర్ణకార శంఖారావం కోసం హైదరాబాద్‌కు

**ప్రజాపక్షం/భైంసా :** హైదరాబాద్‌లో శనివారం నిర్వహించనున్న స్వర్ణకార శంఖారావం కార్యక్రమంలో పాల్గొనేందుకు భైంసా పట్టణం నుండి స్వర్ణకార సంఘం నాయకులు ఘనంగా బయలుదేరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వర్ణకారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, జీఓ ఎంఎస్ నం.272 అమలు, 50 సంవత్సరాలు నిండిన స్వర్ణకారులకు పింఛన్లు మంజూరు చేయడంతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.తమ హక్కుల సాధనే లక్ష్యంగా ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. స్వర్ణకారులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని,ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

## పారిశుద్ధ్య కార్మిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** విధి నిర్వహణలో గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయిన పారిశుద్ధ్య కార్మికుడు చిట్యాల రాజన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి అని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న ముదిరాజ్ అన్నారు.శనివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ గ్రామంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించి,వారికి జేఏసీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఇవాళ స్వచ్ఛభారత్ లాంటి ఎన్ని కార్యక్రమాలు తీసుకువచ్చినా చివరికి పారిశుద్ధ్య కార్మికులే ఆ కార్యక్రమాలు విజయవంతం కావడంలో కీలకంగా పనిచేస్తారని,వారి వల్లే ఇవాళ గ్రామాలు, పట్టణాలు ఆరోగ్యంగా ఉంటున్నాయని అలాంటి కార్మికుని కుటుంబానికి ప్రభుత్వం ఉండాలని కోరారు.మృతుని కుటుంబాన్ని ఆదుకోని పక్షంలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుదామని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికుల ఇన్సూరెన్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని, దానితోపాటు వారి కుటుంబానికి భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఇప్పటికైనా గ్రామ పంచాయతీ కార్మికుల సంక్షేమం పట్ల ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు.

## యాస్వాడలో రైతు అవగాహన సదస్సు

### దోమ తెగులు, పురుగుల నివారణపై సూచనలు



**ప్రజాపక్షం/గన్నేరువరం** : గన్నేరువరం మండలం యాస్వాడ గ్రామంలో శనివారం రోజున ట్రాక్టర్ బ్రాండ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంటలలో వచ్చే వివిధ రకాల తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సేల్స్ ఆఫీసర్ ప్రశాంత్ మాట్లాడుతూ సన్న వరి రకాలలో ఎక్కువగా ఆశించే సుడి దోమ, పాము పొడ తెగులు, మొగి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సరైన సమయంలో తగిన పురుగు మందులను ఎంచుకొని క్రమం తప్పకుండా పిచికారి చేయడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని సూచించారు. అనంతరం అజయ్ మాట్లాడుతూ పురుగుల మందులను పిచికారి చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా తీసుకోవాసిన జాగ్రత్తల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. పిచికారీ సమయంలో మాస్కులు, చేతి తొడుగులు ధరించాలని గాలికి ఎదురుగా పిచికారీ చేయకూడదని తెలిపారు. ఈ అవగాహనకార్యక్రమంలో కంపెనీ సేల్స్ రిప్రెసెంటీటీవ్ ప్రసాద్, సీఏ ప్రశాంత్, రాజులతోపాటు గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ జిల్లా జాయింట్ సెక్రటరీగా గాలిపెల్లి రత్నాకర్ చారి

**ప్రజాపక్షం / గన్నేరువరం** : గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుడు గాలిపెల్లి రత్నాకర్ చారికి తెలంగాణ రక్షణ సేనలో సముచితమైన స్థానం లభించింది. ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం కరీంనగర్ జిల్లా జాయింట్ సెక్రటరీగా అత్యంత కీలకమైన బాధ్యతలు అప్పగించింది. గతంలో తెలంగాణ జాగృతిలో కరీంనగర్ జిల్లా పీఆర్ఓగా రత్నాకర్ చారి విశేష సేవలందించారు. మొదటి నుంచి పార్టీకి, కల్వకుంట్ల కవిత నాయకత్వానికి అత్యంత నమ్మకమైన సైనికుడిగా ఉంటూ పలు బాధ్యతలు ఆయన సమర్థవంతంగా నిర్వహించారు. ఆయన పనితీరు, నిబద్ధత, అనుభవం, ప్రజలతో ఆయన ఉన్న సత్సంబంధాలను పరిగణలోకి తీసుకొని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆయనకు ఈ పదవిని కేటాయించారు. రత్నాకర్ నియామకం పట్ల జిల్లావ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన, జాగృతి శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గన్నేరువరం మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ ఉన్నత పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితోకు, జిల్లా పార్టీ అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్కు, పార్లమెంట్, నియోజకవర్గ ఇంఛార్జిలకు, అలాగే జిల్లా నాయకులకు రత్నాకర్ చారి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### అదనపు కలెక్టర్ దాదే వెంకట మాధవరావు




**ప్రజా పక్షం /ఖానాపూర్** : ఖానాపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం అదనపు కలెక్టర్ దాదే వెంకట మాధవరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించడంతో కార్యాలయంలోఒక్కసారిగా కలకలం నెలకొంది.ముందస్తు సమాచారం లేకుండా కార్యాలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్, ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టిక, రికార్డుల నిర్వహణ,కంప్యూటర్ విభాగం,ధరణి సేవలు,రెవెన్యూ రికార్డులను పరిశీలించారు.ప్రజా సేవలపై ఆరా..ప్రజలకు అందిస్తున్న సేవల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యంగా కుల,ఆదాయ,నివాస ధృవీకరణ పత్రాలు, ధరణిలో వస్తున్న దరఖాస్తులు ఎంతవరకు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.దరఖాస్తు చేసుకున్న ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని,ఎలాంటి జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి** : మండలంలోని ప్రభుత్వ భూముల వివరాలు,ఆక్రమణలకు గురైన భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమణలకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుజాతకు ఆదేశాలు జారీ చేశారు.రికార్డులన్నీ పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపైనే ఉందని సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాతతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేల ఆరోగ్యమే రైతు భవిష్యత్తుకు పునాది



**ప్రజా పక్షం /పెంబి** : నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే రైతు భవిష్యత్తు సుస్థిరంగా ఉంటుందని,అందుకే ప్రతి రైతు ఖేత్ బచావో అభియాన్ ను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు పిలుపునిచ్చారు.పెంబి మండలం వెంకంపోచంపాడ్ గ్రామంలో శనివారం నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ అవగాహన కార్యక్రమంలో వ్యవసాయ అధికారి (ఏవో) నవీన్, ఏఈవో జగదీశ్వర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం నేల ఆరోగ్యాన్ని కాపాడటం, భూసారాన్ని పెంచడమేనని అన్నారు.ప్రతి రైతు తప్పనిసరిగా తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షల ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడాలని సూచించారు. ఇష్టానుసారంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూమి నిస్సారమై పంట దిగుబడులు తగ్గుతాయని హెచ్చరించారు.సుస్థిర సాగుకు మార్గాలు నీటి వనరులను పరిరక్షించుకోవాలి,సహజ, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి,ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణ పాటించాలి,రసాయన ఎరువులకు బదులుగా పశువుల ఎరువు,వర్మీ కంపోస్ట్ వాడాలి,రైతులు తమ పొలాల్లో కలుపు నివారణకు, చీడపీడల నివారణకు సహజ పద్ధతులను అవలంభించాలని,తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోయిరా బతుకమ్మ పోయిరా వమ్మా



**ప్రజా పక్షం /దిలావర్ పూర్** : తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు కంజర్ గ్రామంలో మహిళలు, యువతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.గ్రామంలోని మహిళలు ఉదయం నుంచే వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి,వాటితో అందంగా బతుకమ్మలను పేర్చారు.తంగేడు,గునుగు,బంతి,చామంతి తదితర పూలతో బతుకమ్మలను ఆకర్షణీయంగా అలంకరించారు.సాయంత్రం వేళ మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలను ఒకచోట చేర్చారు.అనంతరం బతుకమ్మలకు పూజలు నిర్వహించి,పసుపు,కుంకుమలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు బతుకమ్మల చుట్టూ వలయంగా నిలబడి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు.యువతులు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటాలు,నృత్యాలతో సందడి చేశారు.డీజే బతుకమ్మ పాటలతో గ్రామ పరిసరాలు మార్మోగగా, రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు, యువతులు, మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.మహిళలు ఒకరికొకరు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న బతుకమ్మ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, యువత కూడా వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని అన్నారు.అనంతరం మహిళలు బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు.బతుకమ్మ వేడుకలు ప్రశాంతంగా,ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.కార్యక్రమంలో మహిళలు,యువతులు, చిన్నారులు, పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన కందుల సంధ్యారాణి పోశం

**ప్రజాపక్షం/రామగిరి** : రామగిరి మండలం బేగంపేట గ్రామానికి చెందిన ముత్తె అరవింద్ కళ్యాణ్ గురువారం హనుమకొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.విషయం తెలుసుకున్న బిజెపి రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షురాలు పెరిక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పోశం బేగంపేట గ్రామానికి వెళ్లి మృతుడి తండ్రి, సాయి ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ ముత్తె కళ్యాణి చంద్రమౌళిని పరామర్శించారు. అనంతరం అరవింద్ కళ్యాణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి,



మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.సంధ్యారాణి వెంట బేగంపేట ఉపసర్పంచ్ సందెల. రేణుక,కుమారస్వామి,గోవిందుల.ఆనంద్,బొడ్డు రవీందర్,బత్తుల రమేష్,దుండే. రాజేందర్,అంకతి,కుమార్, పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అప్రమత్తతకు పరేడ్‌తో పదును

### భైంసా పోలీస్ సిబ్బందికి ఎఎస్‌పి సాయి కిరణ్,పర్యవేక్షణలో వీక్లీ పరేడ్



**ప్రజా పక్షం/భైంసా** : భైంసా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఉదయం పోలీస్ సిబ్బందికి వారాంతపు పరేడ్ నిర్వహించారు. భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, పర్యవేక్షణలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిబ్బంది నిర్వహించిన పరేడ్,డ్రిల్‌ను ఏఎస్పీ పరిశీలించారు. పోలీస్ విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన, శారీరక దృఢత్వం కీలకమని, నిరంతర సాధనతో విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా వ్యవహరించవచ్చని సూచించారు.పోలీసులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ నిత్యం వ్యాయామం చేయాలని,విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.సీఐలు,ఎస్ఐలు,ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోడల్ పాఠశాలలో యుఎన్‌ఓ దినోత్సవం,పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/ముత్తారం** :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్,జూనియర్ కాలేజీలో శనివారం రెండు వేర్వేరు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో గాంధీ స్మారక నిధి,నేషనల్ యూత్ ప్రాజెక్ట్ (ఎన్వైపి)నిఫా ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి (యుఎన్ఓ)దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన ఎన్వైపి స్టేట్ కోఆర్డినేటర్ యాదవరాజు మాట్లాడుతూ ప్రపంచ శాంతి,అంతర్జాతీయ సహకారం,మానవ హక్కుల పరిరక్షణలో ఐక్యరాజ్యసమితి పాత్రను వివరించారు.విద్యార్థులు స్వామి వివేకానంద చికాగో సందేశ స్ఫూర్తితో మానవతా విలువలు అలవరచుకోవాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని ప్రిన్సిపాల్ డా.కేసరి సంతోష్ కుమార్ పేర్కొన్నారు.అనంతరం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎమ్ఎమ్ఎస్ పరీక్ష సన్నద్ధత కోసం ప్రత్యేకంగా రూపొందించిన షార్ట్ టర్మ్ మెటీరియల్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ పుస్తకాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు,మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం,గ్రామ సర్పంచ్ రాపల్లి రాజయ్యలు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.ఈ మెటీరియల్ తక్కువ సమయంలో పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమవడానికి ఎంతో దోహదపడుతుందని వారు తెలిపారు.పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## పారమితలో లయన్స్ క్వెస్ట్ శిక్షణా శిబిరం

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్** : లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో రెండు రోజుల పాటు లయన్స్ క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణా శిబిరం మంకమ్మతోటలోని పారమిత గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో శనివారం ప్రారంభించారు. జిల్లా గవర్నర్ మోర భద్రేశం ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులకు ఆధునిక బోధనా పద్ధతులు, విద్యార్థుల్లో భావోద్వేగ సమతుల్యత, సామాజిక నైపుణ్యాలు, బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. పారమిత విద్యా సంస్థల చైర్మన్ ఇ.ప్రసాద రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మైదం శివకాంత్, కార్యదర్శి బట్టు వినోద్, కోశాధికారి మెతుకు చైతన్యతోపాటు చిదుర సురేశ్, వల్లా కృష్ణహరి, పాల్గొన్నారు.

## రూ.70 లక్షలతో శ్మశానవాటిక రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/చిట్యాలః** చిట్యాల గ్రామంలో శ్మశానవాటికకు వెళ్లే రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సిఆర్ఆర్ నిధులు రూ.70 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నారు. గతేడాది శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభం కాకపోవడంతో సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య ఈ విషయాన్ని జనరల్ బాడీ సమావేశాల్లో ప్రస్తావించారు. ఎంఎల్ఏ గండ్ర సత్యనారాయణరావు దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. పంచాయతీరాజ్ ఏఈ అరుణ, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్‌గౌడ్, వార్డు సభ్యులు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపిన ఎంఎల్ఏకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కాంట్రాక్టర్ పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బైరం భద్రయ్య, మాజీ ఏఎంసి డైరెక్టర్ చిలుముల రమణాచారి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/గణపురంః** పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని గణపురం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ అన్నారు. గతంలో వివిధ కారణాలతో భర్తలు మృతిచెందగా పింఛన్లు వారికి సంబంధించిన భార్యలకు వితంతు ఫించన్లను సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస శనివారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో పింఛన్లు నిలిచిపోయిన అర్హులైన లబ్ధిదారులకు తిరిగి ప్రయోజనం అందించడం ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమన్నారు. పింఛన్ డబ్బులు అందుకోవడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిపిఎం ఒల్లాల కృష్ణ గౌడ్, పాల్గొన్నారు.

## చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/టేకుమట్లః** మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన పోశాల రాజు శ్రీజ దంపతుల కుమారుడు రిత్విక్ మొదటి జన్మదిన వేడుకల్లో టేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, తొలి మాజీ జడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి పాల్గొని చిన్నారని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంగిడిపల్లి సర్పంచ్ గంధం సారయ్య, కాంగ్రెస్ నాయకులు పొన్నమేని ప్రవీణ్‌రావు, భాస్కర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# జనగణనలో బిసి కులగణన చేర్చాలి

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బిఎల్ఎఫ్ డిమాండ్

**ప్రజా పక్షం /ఖానాపూర్ :** కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న 2027 జనగణనలో బీసీ కులగణన కాలమ్ ను తప్పనిసరిగా చేర్చాలని,తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన బీసీ, ఎస్సీ ఎస్టీ, రైతు డిక్లరేషన్ల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఈ డిమాండ్ల సాధన కోసం బహుజన లెఫ్ట్ ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 2026 అక్టోబర్ 23 నుంచి నవంబర్ 2 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న రౌండ్ టేండ్ సమావేశాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఇందులో భాగంగా శనివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని సీఎం రావు ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన రౌండ్ టేండ్ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ దేశంలో సామాజిక న్యాయం సాధించాలంటే కులాలవారీగా జనాభా లెక్కలతో పాటు ప్రజల సామాజిక,ఆర్థిక, విద్యా, ఉపాధి స్థితిగతులపై సమగ్ర సమాచారం సేకరించి ప్రజల ముందు ఉంచాల్సిన అవసరం ఉందన్నారు.ఎంసీపీఐయూ నిర్మల్ జిల్లా కార్యదర్శి పీటర్ మాట్లాడుతూB దేశ జనాభాలో బీసీలకు సంబంధించిన కచ్చితమైన గణాంకాలు అందుబాటులో ఉంటేనే విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాలు, బడ్జెట్ కేటాయింపుల్లో జనాభా దామాషా ప్రకారం న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకురాలు సబ్బని లత మాట్లాడుతూ కేంద్ర



ప్రభుత్వం నిర్వహించే జనగణనలో బీసీల కులాలవారీ జనాభా వివరాలను నమోదు చేయడానికి ప్రత్యేక కాలమ్ ను చేర్చాలని డిమాండ్ చేశారు. కులగణన ద్వారా వెలుగులోకి వచ్చే సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన విధానాలను రూపొందించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన బీసీ, ఎస్సీఎస్టీ, రైతు డిక్లరేషన్ల హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించకుండా, వాటి అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు ఎం సి పి ఐ యు జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్, సహాయ కార్యదర్శి భూక్య సురేందర్, సిపిఐ ఎంఎల్ లిబిరేషన్ జిల్లా కార్యదర్శి మంచు కంటి లక్ష్మ ణ్, జైంట్ సెక్రటరీ కే సంజీవ్, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మహమూద్, సహాయ కార్యదర్శి భోజన్న, బిఎల్ఎఫ్ జిల్లా కార్యదర్శి బోదాస్ గణేష్,సూర రాజన్న,హైమద్ ఖాన్, నరసయ్య .మధు,రాష్ట్ర కమిటీ సభ్యులు కమల,సరూప,సిహెచ్ కళ,విద్యార్థి సంఘం నాయకులు సిహెచ్ ఆనంద్,బీసీ,ఎస్సీ,ఎస్టి సంఘాల నాయకులు పాల్గొన్నారు

# పేద విద్యార్థులకు అండగా నిలవడం బాధ్యత

### ఉచిత కంప్యూటర్ అందజేసిన డాక్టర్ ప్రశాంత్

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఆధార్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణ కేంద్రానికి డాక్టర్ ప్రశాంత్ అభిలాష నర్సింగ్ హోం తరపున ఒక కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆధార్ సంస్థ అధ్యక్షుడు కంసాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ముల్కల గంగారాం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డా.ప్రశాంత్ మాట్లాడుతూ తాను చిన్నతనంలో ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. తనలాంటి పేద విద్యార్థులకు అండగా నిలవడం తన బాధ్యతగా బావిస్తున్నానని తెలిపారు. భవిష్యత్‌లో విద్యార్థులకు మెరుగైన



అవకాశాలు లభించాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందించాలనే మంచి ఆలోచనతో కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆధార్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులను ఆయన అభినందించారు.

# కరీంనగర్ జిజిహెచ్‌లో ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షలు

### మహిళా సిబ్బందికి మమ్మోగ్రఫీ, అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) జనరల్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పీఐఎంఎస్), ఐఎంఏ కరీంనగర్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ సహకారంతో శనివారం స్థానిక మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో మహిళా నర్సింగ్ సిబ్బందికి ఉచిత మమ్మోగ్రఫీ పరీక్షలు, రొమ్ము క్యాన్సర్ అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి నిపుణులు అవసరమైన వైద్య సలహాలు అందించారు. ప్రతిమ వైద్యురాలు డాక్టర్ గీతారెడ్డి రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు గుర్తింపు ప్రాధాన్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగా




హన కల్పించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స ఫలితాలు పొందవచ్చని జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ శాలిని తెలిపారు. మహిళలు క్రమం తప్పకుండా స్వీయ పరీక్షలు చేసుకోవడంతోపాటు వైద్యుల సూచన మేరకు స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డా.హరికృష్ణ, ఆర్ఎంఓ డా.నవీన, డా.ఆలీమ్, ఐఎంఏ అధ్యక్షుడు డా.అరుణ్‌కటారి, కార్యదర్శి డా.విజయ్, కోశాధికారి డా.మానస, ప్రభుత్వ మెడికల్ కాలేజీ వైద్యులు, మాతా శిశు కేంద్రం నర్సింగ్ సూపరింటెండెంట్ , ప్రతిమ వైద్య బృందం, నర్సింగ్ విద్యార్థులు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి

**ప్రజాపక్షం/చిట్యాల :** మండలంలోని నైన్‌పాక గ్రామంలోని శ్రీశ్రీశ్రీ నాపాక సర్వతోభద్ర లక్ష్మి నరసింహస్వామి ఆది ఏకశిలా క్షేత్రాన్ని చల్లగరిగ వాణి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ బండి సంపత్‌కుమార్, డైరెక్టర్ ఇందిర ఆధ్వర్యంలో విద్యార్థులు ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బండి సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఇంతటి అద్భుతమైన ఆలయం నైన్‌పాక గ్రామంలో ఉండడం భూపాలపల్లి జిల్లాకు గర్వకారణమన్నారు. ప్రభుత్వం ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించి, క్షేత్ర ప్రాశస్త్యాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎడ్ల తిరుపతి, రవీందర్, సబిత, పరమేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎంసి వైస్ చైర్మన్ హరిబాబు



**ప్రజాపక్షం/ఖానాపురం :** ఖానాపురం మండలం మనుబోతుల గడ్డ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఓర్సు మమత శేఖర్ కుమార్తె నూతన వస్త్రాలంకరణ కార్యక్రమానికి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ఖానాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాఖమూరి శనివారం ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం గ్రామంలోని పట్టభద్రులను కలిసి ఎంఎల్షి ఎన్నికలకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమో దు చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని పార్టీ ఎంఎల్సి అభ్యర్థి గెలుపునకు కృ షి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియ ర్ నాయకులు మండల ప్రసాద్ రావు, సర్పంచ్ పిండి అనుష కుమా ర్, పిఏసిఎస్ డైరెక్టర్ శివరాత్రి వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్కె కమలుద్దీన్, నాంచారి కుమారస్వామి, మేకల వరదయ్య, మ ంచి అశోక్, భూక్య స్వామి, బొంత శ్రీను, వల్లెపు సాయిలు, మే కల రాంబాబు, బొంత అశోక్, ఎస్కె యాకూబ్ పాషా, పాల్గొన్నా రు.

## జిడబ్ల్యూఎంసి సిటీ ప్లానర్‌గా రవీంద్ర రెడేకర్

**ప్రజాపక్ష/ఖిలా వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జిడబ్ల్యూఎంసి) సిటీ ప్లానర్‌గా రవీంద్ర రెడేకర్ నియమితులయ్యారు. గతంలో వరంగల్ ము న్సిపల్ కార్పొరేషన్‌లో ఇన్‌చార్జి సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహించిన ఆయనకు జాయి ంట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతి అన ంతరం జిడబ్ల్యూఎంసి సిటీ ప్లానర్‌గా పో స్టి ంగ్ ఇచ్చారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**ప్రజాపక్షం/ వరంగల్ :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలుపుతూ శనివారం వారికి మద్దతుగా బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా కార్యదర్శి గోలి సంధ్య ధర్నా లో కూర్చున్నారు. ఈసందర్భంగా బిఆర్‌టియూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని 12 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 17 విభాగాలలో పనిచేస్తున్న 17వేల మంది కాం ట్రాక్టు ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభు త్వం స్పందించకపోవడం దారుణమని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి అప్పటివరకు పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పి మూ డు సంవత్సరాలు గడిచిన ఆ ప్రయత్నాలు చేయలేదని ఆవేదన వ్య క్తం చేశారు. 90 శాతం పేద మధ్యతరగతి ప్రజలకు వీరి ద్వారానే వైద్యం అందుతున్నాయని వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి గత కొన్ని నె లల నుండి రాష్ట్రంలో ప్రత్యక్షంగా ఎక్కడ అమ్మబడటం లేదని ప్రజా వైద్య పైన ఈ ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాల యూనియన్ జిల్లా నాయకులు తంగేళ్ల సుజాత, పిట్టల శ్రీలత, సృజన ,మాధవి పాల్గొన్నారు